వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

● అధికారులకు మేయర్ ఆదేశం
● కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో చెరువులను పరిశీలించిన గద్వాల్ విజయలక్ష్మి

ఓల్డుబోయినపల్లి/కేపీహెచ్‌బీ/హైదర్‌నగర్/పేట్‌బషీరాబాద్/గాజులరామారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బంది లేకుండా వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం ఓల్డుబోయినపల్లి, కేపీహెచ్‌బీకాలనీ, హైదర్‌నగర్, పేట్‌బషీరాబాద్, గాజులరామారంలో పర్యటించారు. ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట చెరువు, బతుకమ్మ కుంట, బోయిన్ చెరువు కట్ట, ప్రగతినగర్ అంబీర్ చెరువు, కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ (రంగదాముని చెరువు)కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వెన్నెలగడ్డ, కట్టమైసమ్మ, పరికి చెరువు, గణేష్‌నగర్‌నాలాను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాలను మండపాల్లో పెట్టినప్పటి నుంచి నిమజ్జనానికి తరలించే వరకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. బేబీ పాండ్స్‌తోపాటు చెరువుల్లో చెత్తాచెదారం తొలగింపు, నిమజ్జనం వీక్షించడానికి వచ్చే భక్తులకు తాగునీరు, టాయిలెట్లు, పార్కింగ్ తదితర వాటిపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల్లో నుంచి తొలగించిన గుర్రపుడెక్కను తరలించకపోవడంపై రాంకీ అధికారులపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి వివరిస్తున్న జడ్సీ అపూర్వ చౌహాన్

కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఉప కమిషనర్ కృష్ణయ్య, కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, నార్నె శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, రావుల శేషగిరి, జీహెచ్‌ఎంసీ ఎస్ఈ చెన్నారెడ్డి, కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్, రాంకీ ప్రతినిధులు అభయ్‌రంజన్, రవినాయక్, నర్సింహారావు పాల్గొన్నారు.

మేయర్ రాక.. ఐడీఎల్ ట్యాంక్‌లో గుర్రపు డెక్క తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఐడీఎల్ ట్యాంక్ పరిశీలనకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం వస్తుండడంతో మూసాపేట సర్కిల్ ఎంటమాలజీ, శానిటరీ విభాగం అధికారులు, సిబ్బంది హైరానా పడ్డారు. ఐడీఎల్ ట్యాంక్‌లో చెత్తాచెదారం, గుర్రపు డెక్కను ఆగమేఘాలమీద తొలగించారు. కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న మేయర్ బేబీ పాండ్స్ శుభ్రం చేయించలేదా అని అధికారులను ప్రశ్నించగా... టెండర్లు పిలిచామని చెప్పారు.


గుర్రపు డెక్క, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కల్వర్ట్ పనుల పరిశీలన

కుత్బుల్లాపూర్: చింతల్ గణేష్‌నగర్‌లో నిర్మిస్తున్న కల్వర్టు పనులను త్వరగా పూర్తిచేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బొడ్డు వెంకటేశ్వరరావు స్థానిక సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీ నర్సింహ,ఈఈ లక్ష్మీగణేష్, ఏఎంఓహెచ్ కవిత, డీఈ పాపమ్మ పాల్గొన్నారు.

హరిజన బస్తీవాసుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా..

ఓల్డుబోయినపల్లి: హస్మత్‌పేట చెరువును పరిశీలించడానికి మేయర్ వచ్చారని తెలుసుకున్న హస్మత్‌పేట హరిజన బస్తీవాసులు విజయలక్ష్మిని కలిసి అధికారులు నోటీసులు ఇచ్చారని చెప్పారు. పైసా పైసా కూడబెట్టి 30 గజాల స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకుంటే అధికారులు కూల్చివేస్తామంటే తాము ఎక్కడికి వెళ్లాలన్నారు. హరిజన బస్తీ వాసులకు నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తానని, ఆందోళన చెందవద్దని మేయర్ వారికి హామీ ఇచ్చారు.

స్పోర్ట్స్ ఎరీనాను సందర్శించిన మేయర్

కేపీహెచ్‌బీకాలనీ: నెక్సస్ మాల్ వద్ద ఫ్లైఓవర్ కింద నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనాను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం సందర్శించారు. స్టేడియం అభివృద్ధి, అక్కడ ఆడుకునే ఆటలు, ఇతరత్రా అంశాలపై ఎకో డిజైన్స్ సంస్థ ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మేయర్ రాకపోవడంతో వెనుతిరిగిన నాయకులు

పేట్‌బషీరాబాద్: రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీ పార్కు-2లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పనులను పరిశీలించేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం వస్తారని స్థానిక నాయకులు పార్కు వద్దకు చేరుకున్నారు. మేయర్ రాకపోవడంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు.


ఎమ్మెల్యేకు నోటీసులు చూపిస్తున్న పద్మావతినగర్ వాసులు

పేదల ఇళ్ల జోలికొస్తే ఊరుకోం : ఎమ్మెల్యే

అల్లాపూర్, 30 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): సున్న చెరువు వద్దగల పద్మావతి కాలనీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబీహా బేగం శుక్రవారం పర్యటించారు. తమకు నోటీసులు ఇచ్చారంటూ బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నలభై సంవత్సరాల నుంచి నివసిస్తున్న వారికి ఇప్పుడు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పద్మావతి కాలనీ, సఫ్దర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లు వెలిశాయన్నారు. హైడ్రా అధికారులు పేదల జోలికి వస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే అన్నారు.

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ




నీటిని పొదుపుగా వాడుకోవాలని వాటర్ ఎయిర్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం జనతానగర్ వడ్డెర బస్తీలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ.. నీటి వృథాను అరికట్టాలని, రేపటి తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని అవగాహన కల్పించారు. ర్యాలీలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. - కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

17న 'వాక్ ఫర్ హోప్'


'వాక్ ఫర్ హోప్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

దుండిగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జలవిహార్‌లో సెప్టెంబర్ 17న వాక్ ఫర్ హోప్ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, అన్వాస ప్రతినిధి శ్రీరామ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక ప్రత్యేక హోమ్‌ను నిర్మించి అందులో వృద్ధులు, అనాథ పిల్లలకు వసతి కల్పించి, వారి బాగోగులు చూడడంతోపాటు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశమే వాక్ ఫర్ హోప్ కార్యక్రమ లక్ష్యమన్నారు. అన్వాస ప్రతినిధి శ్రీరామ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా నిధులు సేకరించి హోమ్ నిర్మించి అందులో వృద్ధులు, అనాథ పిల్లలకు వసతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రమణి, సాకేత్ ప్రణామ్ హోమ్స్ ప్రతినిధులు, ఎంఎల్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఉదయ్‌రంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలను పూజించాలి


బొడ్రాయి పూజలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ తదితరులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలను పూజించాలని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లో శుక్రవారం నిర్వహించిన బొడ్రాయి పూజల్లో ఆయనతోపాటు సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ అనుకూలంగా ఫ్యాషన్ ఉండాలి'

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ పరంగా నూతనంగా ఏది సృష్టించినా అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని బెహ్నో న్యూయార్క్ ఫౌండర్ శివమ్ పుంజ్యా అన్నారు. తన దృష్టిలో సస్టెయినబల్ ఫ్యాషన్ అంటే నిజాయితీగా ఉండటమేనన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) ఆధ్వర్యంలో సస్టెయినబల్ ఫ్యాషన్‌పై రౌండ్‌టేబుల్ చర్చ జరిగింది. వ్యాపారవేత్త పింకీరెడ్డి, ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా, కాన్షియస్ ఎఫర్ట్ ఫౌండర్ సాచిబాల్ పాల్గొన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఫ్యాషన్ వైపు చూస్తోందని గౌరాంగ్ షా అన్నారు. ఇక్కడ లభించినంత చేనేత వస్త్ర వైవిధ్యం మరెక్కడా లభించదని పేర్కొన్నారు. వై ఫ్లో చైర్‌పర్సన్ రిద్ధి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకశాతం వస్త్రాలు మాత్రమే రీ సైకిల్ చేస్తుండడం ఆందోళనకరమన్నారు.

భూదేవిహిల్స్‌లో ప్రభుత్వ భూమిని కాపాడండి

ఆర్డీవోకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

దుండిగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భూదేవి హిల్స్‌లో ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆర్డీవో శ్యామ్ ప్రకాష్‌కు బీజేపీ నాయకులు నల్లా జయశంకర్, ఆకుల సతీష్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన సర్వే నంబరు 323, కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన సర్వేనెంబరు 374, 321లో ఉన్న ప్రభుత్వ భూమిని భూ దేవి హిల్స్ హోమ్స్ వెల్ఫేసొసైటీ మూసాపేటకు చెందిన సర్వే నంబర్లు 183,184,186,187,188.190తో 100 ఎకరాలకు పైగా ఉన్న భూమి సొసైటీకి చెందినదంటూ పరికి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించుకొని, ప్లాట్లు చేసి పేదలకు లక్షలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. సొసైటీ పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న బాలకృష్ణ, మరికొందరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందించిన ఆర్డీవో కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి భూదేవి హిల్స్‌కు చెందిన భూమి వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారని వారు తెలిపారు. ఆర్డీవోను కలిసిన వారిలో బీజేపీ నాయకులు మహేందర్, అర్బన్ జిల్లా ప్రతినిధి బాను, భూదేవిహిల్స్‌కు చెందిన అరుణ్‌రావు, కుమార్‌గౌడ్ ఉన్నారు.


ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చందానగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

చందానగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. విశ్వేశ్వరయ్య కాలనీలో దెబ్బతిన్న యూజీడీ పైప్‌లైన్‌ను కార్పొరేటర్లు మంజులారెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త పైప్‌లైన్ వేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


కాలనీలో డ్రైనేజీ సమస్యను అధికారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

● అధికారులకు జడ్సీ ఉపేందర్‌రెడ్డి ఆదేశం

గచ్చిబౌలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అన్నిసర్కిళ్లలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, రామచంద్రాపురం సర్కిల్ ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి చెరువులు, కుంటలు నాలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేయాలని, రహదారులు, నివాసాల మధ్య నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. దోమల వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా చెరువుల్లో లార్వా దశలోనే నియంత్రణ చేపట్టాలన్నారు. కాలనీ సంక్షేమసంఘాల భాగస్వామ్యంతో చెరువులు, కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. డెంగీ కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చాన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గ్యాస్ పైప్‌లైన్ లీకై మంటలు

జీడిమెట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రామిరెడ్డినగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్ లీకై మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడానికి చర్యలు చేపట్టారు. భాగ్యనగర్ గ్యాస్ సంస్థకు సమాచారం ఇవ్వడంతో గ్యాస్ సరఫరాను నిలిపివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

గచ్చిబౌలి అభివృద్ధికి సహకరించాలి

గచ్చిబౌలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ముకుంద్ రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతునాయక్, సీనియర్ నాయకులు శేఖర్, రాజు, చంద్రమౌళి, సుమన్, మన్నే రమేష్ తదితరులు పాల్గొన్నారు. గచ్చిబౌలి డివిజన్ నేతాజీనగర్‌లో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శుక్రవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.


డీసీ ముకుందరెడ్డికి మొక్క అందజేస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు

ఫతేనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పైప్‌లైన్ రోడ్డులోగల కనకదుర్గ, కాళికాదేవి, శీతలాదేవి ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు దోర్బల కాశీనాథ శర్మ పర్యవేక్షణలో జరిగిన అభిషేకం, కుంకుమార్చన పూజల్లో మహిళలు పాల్గొన్నారు. సినీ ప్రొడ్యూసర్ గొట్టిముక్కల పద్మారావు, ఆయన సతీమణి విజయలక్ష్మి చిత్తారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి ఆర్థిక సహాయం

నిజాంపేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రగతినగర్‌కు చెందిన ధనుంజయ్ కుమారుడు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ధనుంజయ్ శుక్రవారం హన్మంత్‌రెడ్డిని కలిసి విషయం చెప్పగా రూ. 21వేల చెక్కు అందజేశారు. చిన్నారి చికిత్స నిమిత్తం కేహెచ్ఆర్ సేవాదళ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమవంతు సహాయం అందజేయాలని ఆయన కోరారు.

కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● సైబర్‌క్రైం పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్‌కు చెందిన సోషల్ మీడియా విభాగాలతోపాటు ఆ పార్టీ నాయకుల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం/దుండిగల్/ఓల్డుబోయినపల్లి/మియాపూర్/కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ చైతన్య భార్గవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మెట్కాన్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆర్‌ఎంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు, కూషర్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు, కైలాస్‌హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్‌లో..

దేలారిధన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, నూజివీడు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు, ఐడీఏ-2 పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వినాయక్ రాథోడ్ పేర్కొన్నారు

ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ప్రగతినగర్ సబ్-స్టేషన్, మిథులానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు, ప్రగతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, ప్రగతినగర్ మంకీ సర్కిల్, ఎన్టీఆర్ పార్కు, బీఆర్ఎస్ కాలనీ ఫీడర్ల పరిధిల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు, 60 ఫీట్ రోడ్డు, జోడిమాల్ సర్కిల్, తిరుమల, శిల్పా లే-అవుట్, కెనరాబ్యాంక్, దోలారి హోమ్స్, ఆర్‌జీకే ఫీడర్ల పరిధుల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఓల్డుబోయినపల్లిలో..

ఓల్డుబోయినపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు బాలాజీ ఎన్‌క్లేవ్, మల్లికార్జున కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, యాదవబస్తీ, భాగ్యశ్రీ గార్డెన్, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హస్మత్‌పేట, ముస్లీం బస్తీ, సూర్య ఎన్‌క్లేవ్, రామ్‌గోపాల్ ఎన్‌క్లేవ్, సాయిబాబ టెంపుల్, సిండికేట్ బ్యాంక్‌కాలనీలో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు హెచ్‌ఏఎల్ పార్కు, ఆర్ఆర్ టౌన్‌షిప్, బాలాజీ ఎన్‌క్లేవ్, కళింగ ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ సరఫరా ఉండదని బోయినపల్లి సీబీడీ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, శిల్పా లేఅవుట్, బాలాజీ లే అవుట్ ప్రాంతాల్లో, ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు మియాపూర్ ఎక్స్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, ఆదిత్యనగర్, బాలాజీనగర్, శ్రీరంగపురం కాలనీ, లోటస్‌కాలనీ, అరబిందోకాలనీ, జేపీఎన్‌నగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

కేపీహెచ్‌బీ పరిధిలో..

కేపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎల్ఐజీ, ఎంఐజీ ఫ్లాట్స్ మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు భువన విజయం గ్రౌండ్, ఎంఐజీ ఫ్లాట్స్ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు లులు మాల్, రెమెడీ ఆస్పత్రి, ట్రావెల్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ విద్యాసాగర్ తెలిపారు.

న్యాయం చేయాలంటూ దళిత మహిళ ధర్నా

రాయదుర్గం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలంటూ దళిత మహిళ ధర్నాకు దిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ శ్రీలక్ష్మీనగర్‌లో కర్నాట్ ఉదయ్ భాస్కర్, ప్రమీలారెడ్డికి చెందిన అపార్ట్‌మెంట్‌లో ఎస్ఎస్ శాంతి అనే దళిత మహిళ జర్నలిస్టు సేవియర్ కేర్ హాస్పిటల్, కీర్తన టెలివిజన్ సంస్థలను మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. ఆ సంస్థలను స్వాధీనం చేసుకోవాలని ఉదయ్‌భాస్కర్, ప్రమీలారెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలంటూ శుక్రవారం అపార్ట్‌మెంట్ ఎదుట ధర్నాకు దిగింది. తాను డెలివరీ కోసం స్వగ్రామానికి వెళ్తే కార్యాలయాలకు తాళాలు వేశారని, హాస్పిటల్, మీడియా సంస్థలను తిరిగి తెరిపించి తనకు, సిబ్బందికి జీవనోపాధి కల్పించాలని శాంతి కోరుతున్నారు.



ధర్నా చేస్తున్న శాంతి

570 సెల్‌ఫోన్లు రికవరీ

● పోగొట్టుకున్న వారికి అందజేసిన సైబరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లు చోరీ అయినా, పోగొట్టుకున్నా వెంటనే సమీపంలోగల పోలీస్‌స్టేషన్‌లో, సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సైబరాబాద్ క్రైం డీసీపీ కె. నరసింహ సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో నమోదైన ఫిర్యాదులపై దృష్టి సారించి 25 రోజుల్లో రూ. 1.50 కోట్ల విలువైన 570 ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. ఎనిమిది నెలల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2,696 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఈ సందర్భంగా సిబ్బందిని డీసీపీ అభినందించారు.

జల్సాల కోసం చోరీలు

● ముగ్గురి అరెస్ట్.. 9 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

అమీర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, బెస్తవారిపేట మండలం, పాతమల్లాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి చిన్న అవులయ్య(30) ఎర్రగడ్డలో నివసిస్తూ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. కొవిడ్ సమయంలో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తిరిగి 2023లో నగరానికి వచ్చి గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కొంతకాలం సెక్యూరిటీగార్డుగా పనిచేశాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఎస్ఆర్‌నగర్, బాపూనగర్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు. వీటిని నేరేడ్‌మెట్‌లో సెల్‌ఫోన్ మరమ్మతుల షాపు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వెంకటకృష్ణ(33), అంబర్‌పేటలో ఉంటున్న బెస్తవారిపేటకు చెందిన మేకల వెంకటేశ్వర్లు(30)కు విక్రయించేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అవులయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాత్, ఎస్ఐ రాజురాథోడ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ